

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	32	28

2,47,402 మంది ఓటేయలేదు

ఇదీ కోనసీమ జిల్లాలో ఓటర్ల పరిస్థితి

అమలాపురం రూరల్, మే 17: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 83.84 శాతం పోలింగ్ నమోదైంది. అయితే 2,47,402 మంది మాత్రం ఓటు వేయలేదు. జిల్లాలో అత్యధికంగా మండపేటలో 87.06 శాతం, రాజోలులో అత్యల్పంగా 79.02 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో 15,31,410 మంది ఓటర్లు ఉండగా 12,84,008 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజోలులో అత్యధికంగా 41,520 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. అత్యల్పంగా మండపేటలో 28,535మంది పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు ఇలా ఉన్నాయి.

రామచంద్రపురం: 2,03,207 మందికి 1,73,917మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 29,290 మంది ఓటేయలేదు. వారిలో పురుషులు 13,253 మంది, మహిళలు 16,039 మంది ఉన్నారు.

ముమ్మిడివరం: 2,45,296 మందికి 2,05,163 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 40,133 మంది ఓటేయలేదు. వారిలో పురుషులు 18,175 మంది, మహిళలు 21,958 మంది ఉన్నారు.

అమలాపురం: 2,13,508 మందికి 1,75,845 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 37,663 మంది పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్నారు. వారిలో పురుషులు 17,261 మంది, మహిళలు 20,402 మంది ఉన్నారు.

రాజోలు: 1,97,920 మందికి 1,56,400 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 41,520 మంది దూరంగా ఉన్నారు. వారిలో పురుషులు 20,456 మంది, మహిళలు 21,064మంది ఉన్నారు.

పి.గన్నవరం: 1,98,602 మందికి 1,65,749 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 32,853 మంది పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్నారు. వారిలో పురుషులు 15,476 మంది, మహిళలు 17,374 మంది ఉన్నారు.

కొత్తపేట: 2,52,383 మందికి 2,14,975 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 37,408 మంది దూరంగా ఉన్నారు. వారిలో పురుషులు 17,279 మంది మహిళలు 20,114 మంది ఉన్నారు.

మండపేట: 2,20,494 మందికి 1,91,959 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 28,535 మంది దూరంగా ఉన్నారు. వారిలో పురుషులు 13,003 మంది, మహిళలు 15,528 మంది ఉన్నారు.

అధ్వానమే

సాగునీరు, మురుగునీటి కాల్వలు పూర్తి స్థాయిలో ఆధునికీకరణ జరగకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. కోనసీమ జిల్లాలో కాల్వ నీటిపై ఆధారపడి లక్షా 87వేల ఎకరాల్లో వరి సేద్యం జరుగుతోంది. కాల్వలు ఆధునికీకరణ జరక్క ఖరీఫ్‌లో ముంపు సమస్య, రబీలో కాల్వ శివారు భూములకు సాగునీటి సమస్య ఏర్పడుతోంది. ఆధునికీకరించాలంటూ జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశాల్లో పలుసార్లు తీర్మానం చేసినా ఇప్పటి వరకు వాటిని పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

పంట కాల్వల్లో చెత్తాచెదారాలు
రైతులకు తప్పని తిప్పలు
ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలే



పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెం ప్రధాన పంట కాల్వ వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త



పర్యవేక్షణ ఏదీ?

- పూడికతీత పనుల ఊసే ఎత్తని అధికార యంత్రాంగం
- ఐదేళ్ల కాలంలో ఆధునికీకరణ ప్రతిపాదనలకే పరిమితం



పి.గన్నవరం, మే 17: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ల కాలంలో ఇరిగేషన్ వ్యవస్థ దుర్భరంగా తయారైంది. ప్రభుత్వం సాగునీటి పంపిణీ వ్యవస్థను కనీసం పట్టించుకోకపోవడంతో ప్రధాన పంట కాల్వలతో పాటు అనుసంధానంగా ఉండే ఛానల్స్ సైతం నేడు చెత్త కాల్వల్లా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు నుంచి కోనసీమ జిల్లాలోకి మూడు ప్రధాన పంట కాల్వలు ప్రవహిస్తున్నాయి. లొల్ల లాకులు నుంచి సఖినేటిపల్లి వరకు (సుమారు 59 కిలోమీటర్లు), లొల్ల లాకులు నుంచి అమలాపురం మీదుగా చల్లపల్లి వరకు (సుమారు 64 కిలో మీటర్లు), లొల్ల లాకులు నుంచి కుండలేశ్వరం వరకు (సుమారు 64 కిలోమీటర్లు) కాల్వలు ప్రవహిస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో అధ్వానంగా మారాయి. ముఖ్యంగా కాలిబాట వంతెనలు, రెండు వరుసల వంతెనల పిల్లర్ల వద్ద భారీగా చెత్తపేరుకుపోవడంతో కాల్వ విరామ సమయం అనంతరం సాగునీరు ముందుకుపోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వృక్షాలు సైతం కాల్వల్లో పేరుకు పోవడంతో వాటికి జంతు కళేబరాలు అడ్డుపడి దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత ఏడాదీ ఇదే పరిస్థితి వున్నా ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించు కోలేదు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల వేళ కనీసం ప్రతిపాదనలు కూడా పంపించలేదు. చిన్న కాల్వల్లో సైతం పూడికతీత, చెత్త భారీగా పేరుకుపోయిందని... రెండో పంటకు సాగునీటి కోసం నానా అవస్థలు పడ్డామని రైతులు వాపోతున్నారు.



లంకల గన్నవరం ప్రధాన పంట కాల్వ వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త

ముమ్మిడివరం, మే 17: ఖరీఫ్‌లో ముంపు సమస్యతో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అయినవిల్లి, అల్లవరం, రాజోలు, మలికిపురం తదితర మండలాల్లో సుమారు 50వేల ఎకరాల్లో పంటను రైతులు నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని భరించలేక కొందరు ఒక్కో ఏడాది క్రాప్ హాలిడే కూడా ప్రకటిస్తున్నారు. ప్రస్తుత సీజన్లో మే నెలాఖరు సమీపిస్తున్నా ఇప్పటివరకు ఎక్కడా సాగునీటి, మురుగునీటి కాల్వలు ఆధునికీకరణ చేపట్టలేదు. పంట కాల్వల్లో ఎక్కడికక్కడే తూడు, గుర్రపుడెక్క, చెత్తాచెదారం విపరీతంగా పెరిగి సాగునీరు సక్రమంగా సరఫరా కావట్లేదు. ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారు. శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో అవి అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. దీంతో కాల్వ శివారు రైతులకు సాగునీటికి అవస్థలు తప్పట్లేదు. మాగాం-అయినాపురం పంట కాల్వ చెత్తాచెదారంతో అధ్వానంగా మారింది. ఈ పంట కాల్వ ద్వారా 4,300 ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరు సరఫరా అవుతుంది. 11.86 కిలోమీటర్ల నిడివి గల ఈ పంటకాల్వ క్రాపచింతలపూడి నుంచి అయినాపురం వరకు తూడు, గుర్రపుడెక్కలతో నిండిపోయింది. దీనికి తోడు చెత్తాచెదారం చేరిపోవడంతో కలుషితమై దుర్గంధం వెలువడుతోంది. పంట కాల్వల పక్కన ఉన్న నివాస గృహాల్లోని లెట్రిన్, బాత్రూమ్‌ల నుంచి వచ్చే వ్యర్థ నీటిని పంట కాల్వలోకి వదిలివేయడంతో నీరు కలుషితమవుతోంది. క్రాపచింతలపూడి, ముమ్మిడివరం, సోమిదేవరపాలెం, అయినాపురం వరకు పంట కాల్వలో చెత్త విపరీతంగా పేరుకుపపోయింది. ఈ పంట కాల్వలో నీటిని క్రమబద్ధీకరించేందుకు గతంలో నిర్మించిన డ్యామ్‌ల తలుపులు కూడా శిథిలమయ్యాయి. ఇరిగేషన్ బోదెలకు నీటిని సరఫరా చేసే స్లూయిస్, డైరెక్ట్ పైపులు కూడా శిథిలమయ్యాయి. దీంతో సాగునీరు వృథా అవుతోంది. కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ప్రతిఏటా లక్షల్లో ఖర్చు చేస్తున్నా ప్రయోజనం మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. సమస్య మాత్రం శాశ్వత పరిష్కారానికి నోచుకోలేదు. వేసవిలో కెమికల్ ట్రీట్మెంట్ చేస్తే కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పిచ్చిక మొక్కలను శాశ్వతంగా నిర్మూలించడం సాధ్యమవుతుంది. అయితే ఇరిగేషన్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. సాగునీరు, కలుషితం కాకుండా నివాస గృహాల నుంచి వచ్చే వ్యర్థ నీటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పంట కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, కాల్వ శివారు భూములుకు సాగునీటిని సక్రమంగా అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మాగాం-సీహెచ్ గున్నేపల్లి, మాగాం-నక్కతిప్ప పంట కాల్వల పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంది.





చింతలూరు వద్ద గుర్రపుడెక్కతో మూసుకుపోయిన పంట కాలువ... చొప్పెల్ల వద్ద లాకుల దుస్థితి

సాగునీరందక దిగువ భూముల రైతులకు అవస్థలు

ఆలమూరు, మే 17: ఇరిగేషన్‌పై ఐదేళ్లుగా నిర్లక్ష్యం వహించడంతో సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. వేసవిలో మరమ్మతులు, పూడికలు తీయడం వంటి పనులు చేపట్టి ఏడాది పొడవునా సాగునీరు సక్రమంగా అందేలా కాలువలు ఉండేవి. అయితే ఇటీవలి కాలంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సాగునీరు కాలువ దిగువ ప్రాంతాలకు చేరక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో కాలువ పనులు చేస్తున్నారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను అధికంగా వేయడంతో భారీగా పూడికలు ఏర్పడి సాగునీరు ముందుకు పారట్లేదు. గుర్రపుడెక్క కూడా అధికంగా ఉండడంతో సాగునీరు దిగువకు చేరట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగైదు ఏళ్లుగా కాలువ చివరి భూములతో పాటు అనేక ప్రాంతాల్లో నీరు సక్రమంగా చేరకపోవడంతో రైతులు బోర్లు, ఇంజన్ల ద్వారా సాగునీరు తోడుకుని వరి సాగు చేస్తున్నారు. దీంతో ఎకరానికి రూ.5వేల వరకు అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. అయితే కాలువ నీటిపైనే ఆధారపడిన భూములకు నీరు చేరక వరి పంట ఎండిపోయి బీటలు తీయడాన్ని గమనిస్తూనే ఉన్నాము.

లాకులపైనా నిర్లక్ష్యమే...

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వచ్చే కోరం కాలువపై చొప్పెల్ల, ఆలమూరు వద్ద లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి నిర్వహణకు నిధులు మంజూరు కాకపోవడంతో గేట్లు పూర్తిగా పాడైపోయి నీరుగారుతున్నాయి. వేసవిలో కాలువకు నీటి విడుదల నిలుపుదల సమయంలో వాటికి రిపేర్లు చేపట్టాల్సి ఉంది. దిగువ ప్రాంతాలకు సాగునీరు చేరట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లు

అమలాపురం టౌన్, మే 17: జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు డీవీఎస్ ఎల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. అకాల వర్షం కారణంగా రైతులు ఇబ్బందిపడకుండా తాత్కాలికంగా ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టామన్నారు. 'ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా.. ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. రైతులకు మద్దతు ధర అటుఇటుగా లభిస్తుందనడంలో వాస్తవం లేదన్నారు. సాధారణ రకం క్వింటాలుకు రూ.2,183, ఎ-గ్రేడ్ రకానికిరూ.2,203 చెల్లిస్తున్నట్టు తెలిపారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, బాయిల్డ్ రైసుమిల్లులకు తరలిస్తామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లాకు వర్ష సూచన

అమలాపురం సిటీ, మే 17: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు పలు జిల్లాల్లో నాలుగు రోజుల పాటు తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ నెల 20న కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులకాపరులు చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ ఏర్పాట్లు: కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్, మే 17: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జూన్ 4న నిర్వహించనున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఇందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాట్లను శుక్రవారం ఆయన ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను నిశితంగా పరిశీలించి ఆర్వోలకు తగు సూచనలు చేశారు. ఓట్లలెక్కింపు కేంద్రాల్లోకి రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు ఏవిధంగా చేరుకోవాలో వివరించారు. అధికారులు ప్రతి అంశంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నిఘా కోసం ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. జాయింట్ కలెక్టర్, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.కేశవర్ధనరెడ్డి, డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల పహారా

జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలతో పాటు మత్స్యకార గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, ఆర్మ్డ్ రిజర్వ్ బలగాలతో పోలీసు పహారా కొనసాగిస్తున్నట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం నిఘా ఏర్పాటు చేశామని వివరించారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై పోలీసు నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టామని ఎస్పీ చెప్పారు.





చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్

ఈఏపీ సెట్‌కు 631 మంది విద్యార్థుల హాజరు





అమలాపురం రూరల్, మే 17: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండో రోజైన శుక్రవారం జరిగిన ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్షకు 631 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆన్‌లైన్ సెంటర్ కో-ఆర్డినేటర్ అడబాల కుమార్ తెలిపారు. ఉదయం సెషన్‌లో 320 మంది విద్యార్థులు హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో 311 మంది విద్యార్థులు హాజరు కాగా 29 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపల్ డాక్టర్ జేవీజీ రామారావు, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు తెలిపారు.

భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఏపీ సెట్ పరీక్షరాసి వస్తున్న విద్యార్థులు



ఎస్టీయూ ఉద్యమ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలి!

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజానగరం, మే 17: అపరిష్కృత సమస్యల సాధన కోసం ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గైట్ కళాశాలలో రెండ్రోజులపాటు జరిగే రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. మన రాష్ట్రంలో కులానికో కార్పొరేషన్ ఏర్పాటుచేసి పదవులు పందారం చేసినా, ఆ పదవి పొందినవారు కారుకు పెద్ద బోర్డు తగిలించుకోవడం తప్ప ఎటువంటి ఉపయోగం లేదన్నారు. దీనిపై తాను ప్రశ్నించగా అలాగే అలా బోర్డు ఏర్పాటుచేస్తే టోల్‌గేట్ వద్ద టోల్ అడగరన్న సమాధానం వచ్చిందన్నారు. మోదీని ఇంటికి, వైసీపీని ఇడుపులపాయకు పంపాలన్నదే తమ నినాదమన్నారు. చంద్రబాబు సీఎం అయితే ఇంత దుర్మార్గంగా మాత్రం ఉండదని, ప్రజాస్వామ్యం పరిఢవిల్లకపోవచ్చుగానీ ఆయన ఇంటికి వెళ్లి కనీసం ప్రశ్నించే అవకాశం అయినా ఉంటుందని ఒక ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ విద్యారంగం తాజా పరిస్థితులపై మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రధానోపాధ్యాయులకు ఈవెంట్ మేనేజర్లుగా నైపుణ్యం ఇచ్చారంటూ ఛలోక్తి విసిరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల దైనందిన కార్యక్రమం సెల్‌ఫోన్‌తోనే ప్రారంభమవుతోందన్నారు. విద్యానిలయాల్లో విద్యకు ప్రాధాన్యం లేకుండా అప్రధానమైన విషయాలకే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని కొన్ని తరగతులను విలీనం ద్వారా పల్లెబడులకు మంగళం పాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు జి.నాగేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, ఆర్థిక కమిటీ సభ్యుడు ఈశ్వరరెడ్డి, తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీ విశ్వనాథ్, నాయకులు ఎస్‌జే త్రినాథ్‌బాబు, పి.సుబ్బరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.






వాతావరణంలో మార్పులతో సముద్రతీరంలో శుక్రవారం సాయం సంధ్యవేళ ఆకాశం మేఘావృతమై బంగారు కాంతులతో కనువిందు చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఎస్.రామేశ్వరం, ఓడలరేవు తీరాల్లో ఈ దృశ్యాలు కట్టిపడేశాయి. ముఖ్యంగా సముద్రంలో ఇంద్రధనస్సు ఆకట్టుకుంది. - అల్లవరం






ఆలమూరు మండలం మూలస్థానం వద్ద జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యం.. నాగరాజు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆలమూరు/ఆత్రేయపురం మే17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన బర్రే నాగరాజు (25) మోటారు సైకిల్‌పై మూలస్థానం బయల్దేరాడు. ఇందిరాకాలనీ వైపు వెళ్లడానికి డివైడర్ దాటుతుండగా అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ర్యాలి వెంకటేశ్వరనగర్‌కు చెందిన బర్రే సత్యనారాయణ-నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన సతీష్ ఏసీ మెకానిక్. అతడికి ఏడు నెలల కిందట మూల స్థానం అగ్రహారానికి చెందిన అమ్మాయితో వివాహమైంది. చిన్న కుమారుడైన నాగరాజు తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అత్తవారింట్లో ఉన్న సతీష్ తమ్ముడికి ఫోను చేసి ఏసీ రిపేరింగ్‌కు సంబంధించి పార్టు తెమ్మన్నాడు. దానికి తీసుకుని బయల్దేరిన నాగరాజు మూలస్థానం వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. దీంతో ర్యాలిలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్టు

మలికిపురం, మే17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రామరాజులంకలో ముందుగా ఓటువేసే విషయమై ఘర్షణ పడిన నేపథ్యంలో ఒక వ్యక్తిని ఏడుగురు కిడ్నాప్ చేశారు. మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13న ఎన్నికల్లో రామరాజులంకలో ఓటు వేసే విషయమై రేకపల్లి నాగరాజు, నార్ని పద్దయ్యలు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. దీంతో పద్దయ్య మనుమడు, అతని స్నేహితులు కలసి అదే రోజు సాయంత్రం రేకపల్లి నాగరాజును కిడ్నాప్ చేశారు. నాగరాజు మర్నాడు తప్పించుకుని ఇంటికి చేరాడు. కాగా కిడ్నాప్‌కు వాడిన కారును, నార్ని వీర వెంకటశివప్రసాద్ (రామరాజులంక), ఇందుగుల గోపాలస్వామి(గూడపల్లి), కొంబత్తుల వికాస్ (కేశనపల్లి), ఇందుగుల సాయిగణేష్ (గూడపల్లి), కాపిశెట్టి వెంకటసత్యకృష్ణప్రసాద్ (నాని)(గూడపల్లి), తోరం దుర్గాకిరణ్ (గూడపల్లి), కటికిరెడ్డి దుర్గాశ్రీనివాస్ (గూడపల్లి)లు ఏడుగురినీ అరెస్టుచేసి కోర్టుకు పంపినట్టు మలికిపురం ఎస్ఐ తెలిపారు.



నేటి నుంచి సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు

- తొలిరోజు పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా స్వామి, అమ్మవార్లు
- 19వ తేదీ రాత్రి దివ్యకల్యాణం
- 24 రాత్రి శ్రీపుష్పయాగంతో ముగింపు
- వారం రోజులూ నిత్యం వివాహ వేడుకలు, కొండ దిగువ ఊరేగింపు
- ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నూతన పెద్దరథంపై ఊరేగింపు


సత్యదేవుడి కల్యాణం (ఫైల్)

అన్నవరం, మే 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడే వేళ సమీపిస్తోంది. ప్రతిఏటా వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున సత్యదేవుడి దివ్యకల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుండగా క్రోధి నామసంవత్సర కల్యాణోత్సవ వేడుకలు ఈసారి మే 18న ప్రారంభమై 24తో ముగియనున్నాయి. దీనికి దేవస్థానం అధికార యంత్రాంగం రూ.50 లక్షలను వెచ్చిస్తూ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. శనివారం సాయంత్రం సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా భక్తులను అనుగ్రహిస్తారు. స్వామి, అమ్మవార్ల వివాహ కార్యక్రమానికి క్షేత్రపాలకులు సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. కల్యాణమహోత్సవాలు వారంరోజులు కొండపై పెండ్లి వేడుకలు, దిగువన వాహనసేవలు నిర్వహిస్తారు.

18న : వేకుజామున సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరణ, రాత్రి 7 గంటలకు కళామందిరంలో ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 9 గంటలకు కొండదిగువన వెండి ఆంజనేయవాహనంపై సీతారాముల గ్రామోత్సవం జరుగుతుంది.

19న: సుప్రభాతసేవ, ఉదయం 9 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణధారణ, రాత్రి 7గంటలకు కొండ దిగువన వెండి గరుడవాహనంపై పెండ్లికొడుకైన సత్యదేవుడు, వెండి గజవాహనంపై అనంతలక్ష్మి అమ్మవారు వెండి పల్లకీలో సీతారాముల ఊరేగింపు, గ్రామోత్సవం ఉంటుంది.

20న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 5 గంటలకు ప్రధాన ప్రవేశస్థాలిపాక హోమాలు, రాత్రి 7గంటలకు అరుంధతీ నక్షత్రదర్శనం, రాత్రి 9 గంటలకు కొండదిగువన రావణబ్రహ్మ వాహనంపై నవదంపతుల గ్రామోత్సవం.

21న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, మధ్యాహ్నం 2.30కి అనివేటి మండపంలో క్షేత్రపాలకుల సీతారాముల సమక్షంలో సరస్వతీపూజ, పండిత సదస్యం, వేదశాస్త్ర సభ, పండిత సత్కారం రాత్రి 9గంటలకు కొండ దిగువన పొన్నవాహనంపై నవదంపతులకు గ్రామోత్సవం.

22న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 4గంటలకు కొండ దిగువన నవదంపతులకు వనవిహార మహోత్సవం. సాయంత్రం 5 గంటల నుంచి నూతన పెద్ద రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరుగుతుంది.

23న : సుప్రభాతసేవ, శేషహోమాలు, కొట్నాలు, గౌరీపూజను ఉదయం 5గంటలకు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో చక్రస్నానం, సాయంత్రం 4 గంటలకు నీలలోహిత గౌరీపూజ, నాకబలి, దండియాడింపు, ధ్వజావరోహణ, కంకణ విమోచన ఉంటుంది.

24న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, రాత్రి 7.30కి కొండపై నిత్యకల్యాణమండపంలో శ్రీపుష్పయాగం. పేరంటాళ్లకు దంపతీతాంబూలాలు, రవిక వస్త్రాల వితరణ ఉంటుంది.




సత్యదేవుడి కల్యాణం నిర్వహించే వార్షిక కల్యాణ వేదిక... నూతన టేకు రథం


ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన సన్నివేశం దృశ్యం

ముగిసిన పుష్ప2 సినిమా షూటింగ్

మోతుగూడెం, మే17: చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టులో మంగంపాడు, పాలగడ్డ, డొంకరాయి, పొల్లూరు పరిసర ప్రాంతాల్లో వారంరోజులుగా చిత్రీకరించిన పుష్ప2 సినిమా షూటింగ్ శుక్రవారం ముగిసింది. సీలేరు నదిలో దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. శుక్రవారం జరిగిన కొన్ని సన్నివేశ చిత్రీకరణలో స్థానికులకు అవకాశం లభించడంతో వారు ఆనందం వ్యక్తంచేశారు. స్థానికులు అధిక సంఖ్యలో షూటింగ్ ప్రదేశానికి తరలివచ్చారు.




విశేషాలంకరణలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి.. హాజరైన మహిళా భక్తులు

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణోత్సవాలు

సర్పవరం జంక్షన్, మే 17: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి సప్తాహ్నిక వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పురోహితులు స్వామివారికి సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా పలు రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. అనంతరం సాయంత్రం స్వామివారిని శేషవాహనంపై ఉంచి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి సమర్పించిన గరుడ పొంగలి ప్రసాదాన్ని ధ్వజస్తంభం వద్ద మహిళా భక్తులు స్వీకరించారు. ముఖ్యంగా సంతానం లేని మహిళా భక్తులు గరుడ పొంగలి ప్రసాదాన్ని ధ్వజస్తంభం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సంతానం లేనివారు గరుడ పొంగలిని స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. శనివారం శేషవాహన సేవ కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.


న్యూయోమ్ టెక్నాలజీస్ సీఈవోతో సమావేశమైన పద్మరాజు

న్యూయోమ్‌తో కలసి పనిచేయబోతున్నాం

నన్నయ ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, మే 17: భావితరం విద్యార్థుల అభ్యాస కార్యక్రమాలు, వివిధ అంశాల్లో ఆవిష్కరణల కోసం అత్యుత్తమ సెంటర్‌ను రూపొందించడంలో బెంగళూరులోని న్యూయోమ్ టెక్నాలజీస్ కంపెనీతో కలసి పనిచేయబోతున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. న్యూయోమ్ వ్యవస్థాపకుడు, సీఈవో, ఎండీ డాక్టర్ వంగల రజనీకాంత్‌తో నన్నయ వర్సిటీ అధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. వర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి న్యూయోమ్ సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యాసనా కార్యక్రమాలు, వ్యవస్థాపకత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్‌లెర్నింగ్ వంటి అంశాల్లో ఆవిష్కరణలకోసం ఈ సెంటర్‌ను రూపొందించనున్నామన్నారు. విద్యార్థులకు సాధికారత కల్పించడం, విద్యార్థినులు, పారిశ్రామికవేత్తలపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు కాకినాడ జిల్లాలో
1681 మంది విద్యార్థుల హాజరు

జేఎన్టీయూకే, మే17: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి రెండో రోజు శుక్రవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 920 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 829 మంది హాజరయ్యారని, 91 మంది గైర్హాజరుకాగా 90.11 శాతం హాజరునమోదైనట్టు కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 852 మంది హాజరయ్యారని, 75 మంది పరీక్ష రాయలేదని. మొత్తం 91.91 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లకు కలిపి 1847 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1681 మంది హాజరయ్యారని 166 మంది గైర్హాజరుకాగా మొత్తం 91.01 శాతం విదార్థులు హాజరు నమోదైనట్టు కన్వీనర్ తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి పరీక్షలు ముగిశాయని, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు శనివారం ప్రారంభమై 23 వరకూ కొనసాగుతాయన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం, మే17(ఆంధ్రజ్యోతి): ఖైదీలు చెడు వ్యసనాలను దూరం చేసుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకొనే విధంగా పరివర్తన చెందాలని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శ్రీరామ రాహుల్ పేర్కొన్నారు. సోషల్ ఇంక్యుబేషన్‌లో భాగంగా కేంద్ర కారాగారంలో ఖైదీల మానసిక పరివర్తనపై ఓ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఖైదీలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని సైక్రియాటిస్టులు డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ నీలిమ మానసిక పరివర్తన చెందడంపై పలు సూచనలు చేశారు. చెడు స్నేహాలకు, మత్తుపదార్థాలకు బానిసలై మానసిక దౌర్బల్యంతో నేరాలకు పాల్పడ్డారని, అందువల్ల ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు మంచి చెడులను బేరీజు వేసుకొని మంచి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో డీఎస్ ఎం.రాజ్‌కుమార్, కారాగార వైద్యశాల వైద్యులు డాక్టర్ పి.కోమల, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.


రెయిలింగ్ తీసేసి ట్రాఫిక్ దిమ్మెలు ఏర్పాటుచేసిన దృశ్యం

ఆదమరిస్తే గోదాట్లోకే..

మరమ్మతుల పేరిట పలుసార్లు బ్రిడ్జి మూత.. చేసింది శూన్యం
ఇప్పుడు మరోసారి తంతు.. రోడ్‌కం రైల్ బ్రిడ్జి దుస్థితి ఇది



బ్రిడ్జి పక్కన ఇనుప గ్రిల్స్ ఎట్టకేలకు ఏర్పాటు చేస్తున్న దృశ్యాలు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్నది చారిత్రాత్మక రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు వంతెన. దీన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్య నిర్ణయాలతో సర్వనాశనం చేశారు. మరమ్మతుల పేరిట కొన్నిసార్లు, ప్రతిపక్ష పార్టీల యాత్రలను వంతెన మీదుగా వెళ్లకుండా చేయడానికి మరమ్మతులంటూ మరికొన్నిసార్లు పెద్ద తతంగమే నడిపారు. అంతం కాదిది ఆరంభం అన్న చందంగా బాగుచేసే పనులు అనేకసార్లు సాగించారు. ఆ క్రతువులో కమీషన్ల రూపంలో పెద్ద మొత్తంలో జేబుల్లో వేసుకున్నారనే విమర్శలు ఉండనే ఉన్నాయి. మరోవైపు మరమ్మతు పనుల కోసం నెలల తరబడి వంతెనపై ట్రాఫిక్ నిలిపివేసి జనాలను ఇబ్బందులకు గురిచేసినా చివరికి ఒరిగిందేమీ లేదు. వంతెన బాగుపడిందీ లేదు. పైగా మరింత ప్రమాదకరంగా తయారైంది. మరమ్మతుల కోసమంటూ ట్రాఫిక్ నిలిపివేసినా ప్రతిసారీ ధ్వంసమైన రెయిలింగ్‌లకు రంగులు వేయడం, బ్రిడ్జిపై తారురోడ్డు వేయడం వంటి వాటితో సరిపెట్టారు. అదేంటోగాని ప్రతిసారీ ప్రతిపక్షాల నేతలు ఈ వంతెనపై నుంచి వచ్చే సమయంలోనే మరమ్మతులకు తెరతీసేవారు. ఆ క్రమంలో అమరావతి రైతులనూ ఇబ్బందిపెట్టారు. ఇంతా చేసి వంతెన మరమ్మతులను మాత్రం ఈనాటికీ పూర్తిచేయలేకపోయారు. అక్కడక్కడా సిమెంటు రెయిలింగ్‌ని తీసేసి ఇనుప కమ్మీలతో రెయిలింగ్ ఏర్పాటుచేస్తున్నారు. భద్రత దృష్ట్యా ఈ పనులు అత్యంత వేగంగా జరగాల్సి ఉండగా అవి నత్తతో పోటీపడుతున్నాయి. ఇప్పుడు రెయిలింగ్ తీసేసిన చోట ఇదిగో ఇలా ట్రాఫిక్ సిమెంటు దిమ్మలను ఏర్పాటుచేశారు. దీంతో ఈ ప్రదేశం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. అదుపు తప్పితే పాదచారులు సైతం గోదావరిలోకి పడిపోవాల్సిందే. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల అలసత్వాన్ని వెక్కిరిస్తోంది. రాజమహేంద్రవరానికి ఈ వంతెన ఆసియాలోనే ఒక ప్రత్యేక పేరును నిలిపితే.. అటు ప్రభుత్వం, ఇటు యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహించడం పట్ల జనాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి

అకాల వర్షం..

మలికిపురం, మే 17: మలికిపురం మండలంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. ఉదయం నుంచి చిరుజల్లు పడడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. చాలావరకు కోతలు పూర్తయినప్పటికీ రైతులు ధాన్యం ఒబ్బిడి చేసినప్పటికీ ఎండు గడ్డి తడిసి పోవడంతో ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా కోతలు కోయాల్సి ఉంది. కళ్లాల్లోని ధాన్యాన్ని ఇళ్లకు తోలుకుంటున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

పూర్వవిద్యార్థుల కలయిక



అప్పనపల్లి హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు, మే 17: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 నుంచి 2000లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు శుక్రవారం స్కూలు ఆవరణలో కలుసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూలు ఆవరణలో కలియ తిరుగుతూ ఆనాటి మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుని ఆనందోత్సాహాల మధ్య గడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు కలుసుకుని ఒకరి క్షేమ సమాచారాలను ఒకరు అడిగి తెలుసుకుని ఆనాటి చిలిపి చేష్టలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి తమ గురు భక్తిని చాటుకున్నారు.

'చదవడం మాకిష్టం' వేసవి శిక్షణా శిబిరం

అమలాపురం టౌన్, మే 17: అమలాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ ప్రారంభించారు. ఆయన అధ్యక్షతన జరిగిన సభకు సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చదవడం మాకిష్టం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు జరిగే వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొని విద్యార్థులు విజ్ఞానాన్ని పొందాలన్నారు. ముత్యాల శరత్‌బాబు, పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, నందుల ప్రసాద్, రాయుడు నాగేశ్వరరావు, లక్ష్మీసౌజన్య తదితరులు పాల్గొన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారు.



చదవడం మాకిష్టం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వర్మ, నల్లా నరసింహమూర్తి తదితరులు

ఇసుక, మట్టి తవ్వకాలకు బ్రేక్ పడిందా?



మానేపల్లి లంకలో ఈనెల 15న జరిగిన ఇసుక తవ్వకాలు

- గోదావరి తీర ప్రాంతాలను గుల్ల చేసిన మట్టి, ఇసుక మాఫియా
- తవ్వకాలకు అడ్డంకిగా మారిన వరుణుడు
- కన్నెత్తి చూడని అధికారులు

పి.గన్నవరం, మే 17: గతేడాది గోదావరి వరదలు, వర్షాలు ముగియగానే గోదావరి నదీ తీర ప్రాంతాల్లో మొదలైన ఇసుక, మట్టి తవ్వకాలు ఇప్పటివరకు బ్రేకులు లేకుండా కొనసాగాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో సైతం యథేచ్ఛగా మట్టి, ఇసుక తవ్వకాలు జోరుగా సాగాయి. ప్రస్తుతం కోర్టు తీర్పు అనుసరించి అక్రమ తవ్వకాలకు బ్రేక్ పడనుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాహనాలు తిరగడానికి అనుకూలంగా లేకపోవడంతో మాత్రమే తవ్వకాలకు బ్రేక్ పడినట్లు తెలిసింది. కొన్ని ర్యాంపుల్లో మళ్లీ బాటలను సైతం మాఫీయా ప్రతినిధులు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఇదిలావుండగా పి.గన్నవరం మండలానికి సంబంధించి ఉడిమూడి లంకలో ఒక మట్టి ర్యాంపు, మానేపల్లిలో ఐదు మట్టి ర్యాంపులు, ఒక ఇసుక ర్యాంపు నడుస్తున్నాయి. ఈ ర్యాంపుల్లో మూడు మట్టి ర్యాంపులు గత కొన్నినెలలుగా నడుస్తున్నప్పటికీ ఇటీవలే మరికొన్ని మట్టి ర్యాంపులు తెరమీదకు వచ్చాయి. పట్టా భూములు, పెరుగులంకల్లో రైతులకు కాసులు ఎరచూపి మట్టి మాఫియా జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు. అధికార వైసీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్న మట్టి, ఇసుక ర్యాంపులకు ఉన్నతాధికారులు సైతం వంతపాడటంతో క్షేత్రస్థాయిలో కనీసం నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరిపి తీర ప్రాంతాలను గుల్ల చేశారు. స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ నామమాత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్డుపై ఇసుక, మట్టితో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నప్పటికీ కనీసం పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం పర్యవేక్షణ చేయకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఎన్నికల పోలింగ్‌రోజు మాత్రమే తవ్వకాలు నిలిపివేశారని అనంత రం తవ్వకాలు ప్రారంభమై ఇటీవలే వర్షం పడటంతో ప్రస్తుతం తాత్కాలికంగా బ్రేక్ వేశారని స్థానిక ప్రజానీకం చెప్పుకుంటున్నారు.



ఏ.వేమవరంలో రక్తపోటు నివారణా దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో దుర్గారావు దొర



మామిడికుదురు: లూటుకుర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మానసిక ప్రశాంతతో రక్తపోటు నివారణ

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర

అమలాపురం టౌన్, మే 17: మానసిక ప్రశాంతతో రక్తపోటును అధిగమించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకుని మానసిక ప్రశాంతతో జీవించాలన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎ.వేమవరంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రక్తపోటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో ప్రదర్శన జరిపారు. రక్తపోటు వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. గుండె జబ్బులు, ఇతర అనారోగ్యాలకు రక్తపోటే ప్రధాన కారణమన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు ఉప్పు వాడకాన్ని తగ్గించాలన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారు జీవనశైలిలో తగు మార్పులు చేసుకుంటూ నిత్యం కొద్దిపాటి వ్యాయామం చేయాలన్నారు. అదనపు డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి, ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్, నోడల్ అధికారి డాక్టర్ ఎం.సుమలత, ఆర్బీఎస్కే ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ స్వర్ణకమల తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటు పట్ల అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు, మే 17: రక్తపోటు పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వర్ణలత సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీల్లో అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయా పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించారు. ప్రతీఒక్కరు రక్తపోటును నియంత్రణలో ఉంచుకుని ఎక్కువ కాలం జీవించాలని ఆకాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించారు. రక్తపోటు వచ్చినప్పుడు వచ్చే లక్షణాలు ప్రజలకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడికి తెగబడ్డ..

తోట త్రిమూర్తులు బెయిల్ రద్దు చేసి అరెస్టు చేయాలి

- దళిత ప్రజా సంఘాల ఐక్య వేదిక డిమాండ్

అమలాపురం టౌన్, మే 17: బెయిల్ నిబంధనలు ఉల్లంఘించి దళిత మహిళపై దాడికి తెగబడ్డ తోట త్రిమూర్తులు బెయిల్‌ను రద్దుచేసి తక్షణం అరెస్టు చేయాలని డిమాండుచేస్తూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయంలో ఎస్బీ సీఐ వి.శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వెంకటాయపాలెం శిరోముండనం కేసులో జైలు శిక్ష పడి బెయిల్‌పై ఉన్న తోట త్రిమూర్తులు మరోసారి దళిత మహిళా మాజీ సర్పంచ్ దాసిమీనాకుమారిపై దాడి చేయడాన్ని విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు తీవ్రంగా ఖండించారు. వల్లూరు మాజీ సర్పంచ్‌పై దాడి కేసులో తోట త్రిమూర్తులుకు బెయిల్ ఇవ్వరాదని వినతిపత్రంలో కోరారు. బెయిల్‌పై ఉన్నముద్దాయి ఏ నేరానికి పాల్పడ్డా బెయిల్ రద్దవుతుందని వెంకట్రావు పేర్కొన్నారు. అట్రాసిటీ కేసులో శిక్షపడి మరో అట్రాసిటీకి పాల్పడ్డ త్రిమూర్తులు బెయిల్ రద్దుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులపై తరచూ దాడులకు దిగడం త్రిమూర్తులుకు అలవాటుగా మారిందని విమర్శించారు. త్రిమూర్తులుతో పాటు అతని అనుచరులను తక్షణం అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండుకు పంపించాలని కోరారు. వినతిపత్రం ప్రతులను ఎన్నికల కమిషన్‌తో పాటు జాతీయ ఎస్సీ కమిషన్‌కు పంపించనున్నట్టు చెప్పారు, కార్యక్రమంలో విశాఖ నుంచి వచ్చిన వి.ద.సం. సహ కన్వీనర్లు ఈతలపాక సుజాత, బళ్ల కుమార్, వెంకటాయపాలెం శిరోముండనం బాధితుడు సీహెచ్ పట్టాభిరామయ్య, న్యాయ పోరాట కమిటీ నాయకుడు గుబ్బల శ్రీనివాసరావు, దళిత ప్రజా సంఘాల నాయకులు రేవు తిరుపతిరావు, అమలదాసు బాబూరావు, గిడ్ల వెంకటేశ్వరరావు, కొంకి రాజామణి, మోకా శ్రీను, శెట్టిబత్తుల తులసీరావు, రాగుర్తి సత్యనారాయణ, బొంతు రమణ, మెండి డేవిడ్‌అంబేడ్కర్ పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్బీ సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

మండపేట, మే17: మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించారు. కోడ్నెక్సా ఎడ్యుకెట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో కళాశాలలో బీఎస్సీ, బీకాం చదివిన పదిమంది విద్యార్థులు జాబ్‌లకు ఎంపికయ్యారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మూడునెలలపాటు ఎంపికైన వారికి వేతనంతో కూడిన శిక్షణ ఉంటుందని శిక్షణ ముగిసిన తర్వాత వారికి ఏడాదికి రూ. 6లక్షల నుంచి రూ.8లక్షలు వరకు వేతనం ఉంటుందని సంబంధిత కంపెనీ ప్రతి నిధులు తెలిపారని కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తమ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపిక కావటంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులతోపాటు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులు

రిక్రియేషన్ క్లబ్‌లపై ముగిసిన విచారణ

యానాం, మే 17: యానాం నియోజకవర్గంలో రిక్రియేషన్ పేరుతో నిర్వహిస్తున్న పేకాటక్లబ్‌లకు మున్సిపాలిటీ ద్వారా తీసుకున్న అనుమతులు, లైసెన్స్‌లకు సంబంధించి అంశాలపై పుదుచ్చేరి మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు గత మూడు రోజులుగా నిర్వహించిన విచారణ ముగిసింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా పుదుచ్చేరి మున్సిపల్ కమిషనర్ కందస్వామి, సత్యనారాయణన్‌ల బృందం యానాం వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత మూడు రోజుల యానాం మున్సిపల్ కార్యాలయంలో అధికారులను, బిల్ కలెక్టర్ ఇతర సిబ్బందిని విచారించడంతోపాటు క్లబ్‌లకు సంబంధించి నివేదికలను, ఇచ్చిన అనుమతులను తదితర అంశాలను విచారణ నిర్వహించారు. విచారణ ముగించుకుని అధికారుల బృందం శుక్రవారం ఉదయం పుదుచ్చేరి పయనమై వెళ్లారు. అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

22తో ముగియనున్న దరఖాస్తుల ఆహ్వానం

యానాం, మే 17: సీబీఎస్ఈ పరిధిలోని యానాంలోని ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు ఈనెల 22తో ముగియనుందని విద్యాశాఖ డైరెక్టర్ ప్రియదర్శిని ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎంపిక జాబితాను 24న ప్రచురిస్తామన్నారు. 27న ప్రభుత్వ, 29న ఎయిడెడ్, 31న ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జూన్ 6న తరగతులు ప్రారంభిస్తామన్నారు.

రాయవరం హైస్కూల్‌ను పరిశీలించిన డీవైఈవో

రాయవరం, మే 17: మండలంలోని రాయవరంలో వున్న శ్రీరామయ్య జిల్లాపరిషత్ హైస్కూల్లో విద్యాకానుక కిట్లను రామచంద్రపురం డీవైఈవో వైఎల్ నరసింహఫణి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో వున్న ఏడు గదుల్లో నిల్వచేసిన నోట్, టెక్స్ పుస్తకాలు, స్కూల్ సామగ్రి బ్యాగ్‌లను భద్రపరచగా వాటిని ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు ప్రారంభించే నాటికి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు అన్నింటినీ పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని ఆయన చెప్పారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం ఎం.వి.శాంతిసునీత, ఎంఈవో, సూర్యనారాయణ, సీఆర్‌పీలు ఉన్నారు.

మాజీ జడ్పీటీసీ సంతోషంకు ఎంపీ బోస్ పరామర్శ

ద్రాక్షారామ, మే 17: ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషంను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ శుక్రవారం పరామర్శించారు. రామచంద్రపురంలో ఎన్నికల ముందు జెడ్పీటీసీ ఇంత సంతోషం గాయపడి కాకినాడలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఎంపీ బోస్ సంతోషంను పరామర్శించారు.

పారా లీగల్ వలంటీర్‌గా చేరండి

కొత్తపేట, మే 17: కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టు పరిధిలో నూతనంగా పారా లీగల్ వలంటీర్ నియమకాలు చేపట్టినట్టు సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో తెలుగు చదవడం, రాయడం వచ్చిన వారు జూన్ 10వ తేదీలోగా బయోడేటాతో కోర్టు ఆఫీసులో దరఖాస్తు అందజేయాలని ఆయన కోరారు.

పదోన్నతి పొందిన శ్రీధర్‌కు సత్కారం



ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్, మే 17: లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో చిరుద్యోగిగా చేరిన వై.శ్రీధర్ అంచెలంచెలుగా ఎదిగి సీనియర్ బ్రాంచి మేనేజరుగా పదోన్నతి పొందగా ఎల్ఐసీ ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం, డెవలెప్‌మెంట్ ఆఫీసర్స్ యూనియన్, ఏజెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీధర్‌ను సత్కరించారు. కొవిడ్ సమయంలో ఖాతాదారులకు విశేష సేవలు అందించిన ఘనత శ్రీధర్‌కు దక్కుతుందని కొనియాడారు. అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో

ప్రత్యేక పూజలు

అంబాజీపేట, మే 17: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నుంచి 23వ తేదీ వరకే నిర్వహించనునట్లు కమిటీ అధ్యక్షుడు కాసు శ్రీనివాసరావు, కార్యదర్శి గోకవరపు శివ, కోశాధికారి బొండాడ శివలు తెలిపారు.

పంట కాలువలోకి

దూసుకెళ్లిన కారు

- తప్పిన పెనుప్రమాదం

కొత్తపేట, మే 17: రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళ్తున్న మారుతి కారు శుక్రవారం మధ్యాహ్నం అదుపుతప్పింది. కొత్తపేట సమీపంలో రావులపాలెం-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువలోకి దూసుకువెళ్లింది. స్థానికులు అప్రమత్తమై కారులో వున్న వారిని స్వల్ప గాయాలతో ఒడ్డుకు చేర్చారు. పంట కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



కొత్తపేట సమీపంలో పంటకాలువలోకి దూసుకువెళ్లిన కారు

కూటమి అభ్యర్థి వరప్రసాద్ ఆత్మీయ పర్యటన

అంతర్వేది, మే 17: కులమతాలకు అతీతంగా అక్కున చేర్చుకుని విజయాన్ని అందిస్తున్న ప్రజలందరితో ఆత్మీయ పర్యటన చేయాలని రాజోలు కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ అంతర్వేది పల్లిపాలెం గ్రామం నుంచి ఆత్మీయ పర్యటనను శుక్రవారం ప్రారంభించారు. తొలుత అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి అనంతరం పల్లిపాలెం గ్రామంలో నాయకులు, ప్రజలను కలిశారు. అనంతరం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని దేవస్థానం, గొంది, అంతర్వేది, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో ఆత్మీయ పర్యటన నిర్వహించారు. ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తూ మనలో ఒకరిగా నాకింత అభిమానాన్ని అందించిన రాజోలు నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులతో కలిసి మాట్లాడి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోతురాజు నరసింహారావు(కిశోర్), ఒడుగు శ్రీను, దొండపాటి రవికుమార్, ఎంపీటీసీలు బైరా నాగరాజు, చొప్పల బాబూరావు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, గుండుబోగుల పెద్దకాపు, తిరుమాని ఆచార్యులు, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, మందపాటి వెంకటేశ్వర్లు, కొల్లు రాము, నాగు, ఉండపల్లి అంజి, నాయకులు పాల్గొన్నారు.



అంతర్వేది ఆలయంలో నాయకులతో కలసి పూజలు చేసేందుకు వెళుతున్న దేవ వరప్రసాద్

జనసేన పార్టీ కార్యాలయంలో

చోరీపై ఫిర్యాదు

ముమ్మిడివరం, మే 17: జనసేన పార్టీ కార్యాలయంలో చోరీ ఘటనపై ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు అందింది. ముమ్మిడివరం టీటీఆర్ నగర్‌లో చోడపనీడి బాలకృష్ణ, చోడపనీడి చక్రధరరావులకు చెందిన ఖాళీ స్థలంలో జనసేన కార్యాలయం ఏర్పాటుకు 2019 జనవరి 21న సీహెచ్ గున్నేపల్లి గ్రామానికి చెందిన గొలకోటి వెంకటేశ్వరరావు ఒకసంవత్సరం కాలానికి లీజు ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత వెంకటేశ్వరరావు మృతి చెందాడు. అప్పటి నుంచీ ఏవిధమైన అద్దె చెల్లించట్లేదు. గురువారం రాత్రి ముగ్గురు వ్యక్తులు కార్యాలయంలోని కుర్చీలు, బల్లలు, ఏసీలు, ఫ్యాన్లు, ఇతర సామగ్రిని దొంగిలించుకుపోయారని, విచారణ నిర్వహించి దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని చోడపనీడి బ్రదర్స్ ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి కల్యాణోత్సవాలు

ముమ్మిడివరం, మే 17: మండలంలోని శ్రీఅనంతలక్ష్మిసత్యవతీ సమేత వివేక సత్యనారాయణస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు జరగనున్నాయి. 19వ తేదీ ఉదయం ప్రత్యేక వ్రతాలు, సాయంత్రం కల్యాణం, 20న మూలమూర్తులకు విశేష అభిషేకాలు, 21న ప్రత్యేక పూజలు, సదస్యం, 22న విశేష పూజలు, 23న చక్రస్నానం, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, గ్రామోత్సవం, భారీ అన్నసమారాధన జరుగుతాయని నిర్వాహకులు నడిమింటి సూర్యప్రభాకరావు, వీపూరి వెంకటసత్యనారాయణరాజు, కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి

రూ.లక్ష విరాళం



వాడపల్లి వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 17: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రాజమహేంద్రరానికి చెందిన కొలుసు సాయిదుర్గేష్ రూ.1,01,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. శుక్రవారం వివిధ సేవలద్వారా రూ.3,69,700 ఆదాయం లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

రేపు సత్యదేవుని కల్యాణం



ర్యాలి సత్యనారాయణస్వామి

ఆత్రేయపురం, మే 17: మండలంలోని ర్యాలిలో శ్రీరమాసత్యనారాయణస్వామి దివ్య కల్యాణోత్సవాలను ఈనెల 19 నుంచి 24వ తేదీవరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఈవో కృష్ణ చైతన్య తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారిని పెళ్లి కుమారుడిని చేసి సాయంత్రం ధ్వజారోహణం గావించి రాత్రి స్వామివారి కల్యాణం జరుపుతారు. 20న హోమం, ప్రత్యేక పూజలు, 21 సదస్యం, 22న హోమం, పూజలు, 23న పూర్ణాహుతి, చక్రస్నానం, 24న పుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో చెప్పారు.

వైభవంగా గ్రామదేవత సోమాలమ్మ జాతర ఉత్సవాలు



ఉప్పలగుప్తం, మే 17: ఉప్పలగుప్తం గ్రామ దేవత సోమాలమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. శుక్రవారం నాగులపల్లి పాపయ్యరాజు-శాంతికుమారి దంపతుల నిర్వహణలో భైరవభొట్ల సుబ్రహ్మణ్యశర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం నాగులపల్లి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నసమారాధన చేశారు.

19న శివకేశవుల కల్యాణం

అంబాజీపేట, మే 17: ఏకాదశ రుద్రులలో ఒక్కరైనా గంగలకుర్రు అగ్రహారం సర్వేశ్వర రుద్రుడు శ్రీ ఉమా పార్వతీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామివార్ల కల్యాణం ఈనెల 19న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19న ఉదయం అంకురారోహణ, ధ్వజారోహణ, రాత్రి స్వామివారి దివ్యకల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 20, 21, 22వ తేదీల్లో స్వామివారి వైశాఖ పూజ నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు స్వామివార్లను పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. 23న స్వామివారి త్రిశూల చక్రస్నానం, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 24న స్వామివారి శ్రీ పుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగిస్తాయని ఆలయ అర్చకులు చంద్రమౌళి వెంకట నరసింహశర్మ, సుదర్శనం కేశవచార్యులు తెలిపారు.

నేడు అమ్మవార్ల జాతర



పెదపట్నంలంకలోని అమ్మవార్లు

మామిడికుదురు, మే 17: పెదపట్నంలంకలోని బొక్కావారిపాలెంలో ఉన్న వనువులమ్మ, మహలక్ష్మిఅమ్మవార్ల జాతరను శనివారం రాత్రి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరను పురస్కరించుకుని ఆలయాలను సుందరంగా అలంకరించారు. జాతరను పురస్కరించుకుని వివిధ రకాల డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పులు, చిత్రవిచిత్ర వేషధారణలతో జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ వారు తెలిపారు.